# సంక్రాంతి ప్రాశస్త్యము.



ఈ సారి ముఖచిత్రము చూడగానే, సెలవుపెట్టి ఎక్కడికైనా వెళ్ళాలని అనిపించి ఉంటుంది. నేను చెప్పినది నిజమేనా? కాని, ఈ చిత్రములో ఒక విశేషముంది. సూర్యోదయము రోజూ జరిగేదే. కాని, సంక్రాంతి రోజు సూర్యోదయము విలక్షణమైనది. ఈ రోజు సూర్యుని దిశమారుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి, తమిళనాడులో పొంగల్, ఉత్తరప్రదేశ్‌లో ఖిచరి, పంజాబ్‌లో మాఘి, మధ్యప్రదేశ్‌లో శకరత్, అస్సాంలో భోగలి బిహుగా పిలువబడే ఈ పండుగ సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే సందర్భములో జరుపుకుంటారు. ఈ రోజునుండి ఆరు నెలల కాలము ఉత్తరాయణముగాను, తదుపరి ఆరు నెలలు దక్షిణాయనముగాను వ్యవహరిస్తారు. ఉత్తరాయణము దేవతలకు పగలుగా విశ్వసిస్తారు. అందువలన ఉత్తరాయణము పుణ్యకాలముగా భావిస్తారు.

చాలా ప్రదేశములలో సంక్రాంతి పంటలు పండి, దినుసులు ఇంటికి చేరిన సందర్భములలో జరుపుకుంటారు. క్రొత్తగా పండిన పంటద్వారా లభించిన దినుసులను, ధాన్యమును ఉపయోగించి రకరకములైన వంటకాలను (కట్టుపొంగలి, చక్కెరపొంగలి, రవ్వపొంగలి మొదలైనవి) తయారుచేసి సూర్యభగవానునికి నైవేద్యముగా సమర్పిస్తారు. విజ్ఞానమును, మేధస్సును ప్రసాదించమని సూర్యభగవానుని ప్రార్థిస్తారు. సంక్రాంతి పండుగరోజు (భోగి తరువాత) వంశములో పెద్దలను స్మరించుకొంటూ, పేదలకు అన్నదానము, వస్త్రదానము చేస్తారు. ప్రతివారూ వారి శక్తిమేరకు దానధర్మములు చేస్తారు. ఈ పండుగ రోజులలో - కుటుంబములో పిన్నలు పెద్దలకు నమస్కారము చెయ్యడం, పెద్దలు పిన్నలను దీవిస్తూ, వారికి ఏవైనా బహుమతులు ఇవ్వడం ఆచారము.

మహాభారతకాలములో ఇచ్ఛామరణము పొందే వరాన్ని పొందిన భీష్మపితామహుడు, ఉత్తరాయణపుణ్యకాలము వచ్చేవరకు అంపశయ్యపై పడియుండి, ఉత్తరాయణకాలములో తనువు విడిచినట్లు చెబుతారు. అలాగే ఈ రోజు సూర్యుడు, తన పుత్రుడు, మకరరాశికి అధిపతి అయిన శని ఇంటిలోనికి ప్రవేశించడము జరుగుతుందని, సామాన్యముగా ఒకరంటే మరొకరికి సఖ్యతలేని రవి, శని ఇలా కలుసుకోవడం విశేషం. ఇది తండ్రి-కొడుకుల అనుబంధాన్ని తెలియజేస్తుంది.

మనకందరికీ తెలుసు సముద్రము, చిన్నచిన్న నీటి బిందువుల సముదాయమని. అలాగే మనమందరమూ మనజీతమును బట్టి ఎంతో కొంత సొమ్మును పేదల సంరక్షణకు అందజేసినచో, ప్రపంచమే మారిపోతుంది. కాని ఇది ఒక రోజులో జరిగేది కాదు. వెయ్యిమైళ్ళ ప్రయాణమైనా ఒక అడుగుతోనే ప్రారంభమౌతుందనేది జగమెరిగిన సత్యం. కావున మనమంతా ఆ మొదటి అడుగును వేసి, మరింతమందికి ఆదర్శంగా నిలుద్దాం! ఇదే మన నూతన సంవత్సరములో తీర్మానము కావాలి.

మనమంతా ప్రపంచశాంతిని ఆకాంక్షిద్దాం! మనమంతా సమసమాజానికై కృషిచేస్తూ, ప్రతి ఒక్కరికీ తినడానికి సరిపడే ఆహారము, కట్టుకోవడానికి సరిపడే బట్టలు మరియు తలదాచుకోడానికి సరిపడే వసతిని కల్పించేందుకు మనవంతు కృషిచేద్దాం. మన సంఘమునకు మంచి మిత్రులుగా (సంఘమిత్రులుగా) వ్యవహరిద్దాం. నూతన సంవత్సర శుభాకాంక్షలతో ... - **సుశ్రీ.**